

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

9

**వాళ్ళింట్లోని పద్ధతులన్నీ** అమెరికన్ ఇళ్ళల్లోని పద్ధతులే. రాత్రి ఏడుదాకానే టీ.వీ చూడనిస్తారు. ఆ తరువాత ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోవాలి. తొమ్మిది దాటాక మేలుకుని ఉండకూడదు.

ఆ రాత్రి పావని, రవి ఎప్పటిలా తండ్రికి గుడ్‌నైట్ చెప్పారు. కానీ వాణి గుడ్‌నైట్ చెప్పలేదు.

లక్ష్మి చెప్పింది తన భర్తతో. "ఉదయం భాగోతం చూశారుగా. ఇండియాకెళితే ఇది అక్కడి పద్ధతులు, రాజకీయాలు చూసి ఇంకాస్త ఆ దేశాన్ని ద్వేషిస్తుందని నాకు భయంగా ఉందండి."

లక్ష్మి, వెంకటేశ్వరరావు అమెరికా నించి ఇండియా వెళ్ళినప్పుడల్లా చూస్తూనే ఉన్నారు. గతంలోకన్నా అక్కడి పరిస్థితులు హీనం అవడం. ఇండియాతో పోలిస్తే అమెరికాలో ప్రజాజీవితం ఎంతో సాఫీగా, సౌకర్యంగా జరిగిపోతుంది అని వాళ్ళకు తెలుసు.

క్రితంసారి వాళ్ళు ఇండియా వెళ్ళినప్పుడు విజయవాడ నించి హైదరాబాద్ చేరుకుని బాంబేకి ఫ్లయిట్‌లో వెళ్ళాలి.

తెల్లారుఝామున నాలుగున్నరకు మెలుకువ వచ్చింది. చూస్తే బస్ హైదరాబాద్‌కి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఆపేశారు. వాహనాలన్నీ నిలిచిపోయి ఉన్నాయి.

"ట్రాఫిక్ జాములా వుంది?"

"కాదు. ఆపేశారు" ఓ ప్రయాణీకుడు చెప్పాడు.

"దేనికి?" అడిగింది పావని.

"రాజీవ్ గాంధీని హత్య చేశారంటున్నారు"

"ఎక్కడా? ఈ రోడ్డుమీదా? పోలీసులు అందర్నీ తనిఖీ చేస్తున్నారా?"

"కాదు. మద్రాసు దగ్గర ఎక్కడోనట. "

"మద్రాసు దగ్గరయితే ఇక్కడెందుకు ఆపేశారు?" అడిగాడు రవి ఆశ్చర్యంగా.

"ఇవాళ భారత్ బంద్ చేస్తారు."

"బంద్ అంటే?"

"షట్డౌన్" చెప్పింది లక్ష్మి.

"హలో.. ఇండియా షట్డౌన్?" ఆశ్చర్యంగా అడిగింది పావని.

"అవును, షాప్స్, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్ ట్రాన్స్‌పోర్టు ఒకటేమిటి అన్నీ మూసేస్తారు బంద్ రోజు. తెరిస్తే తన్నులే."

"ఎవరు తంతారు?" అడిగింది వాణి కూడా ఆసక్తిగా.

"గూండాలు."

"పోలీసులేం చేస్తారు మరి?"

"వాళ్ళంతా పొలిటికల్ గుండాలు కాబట్టి పోలీసులు ఏం చెయ్యరు."

"పొలిటికల్ గూండాలంటే?"

"రాజకీయపార్టీ ఆసరా కలిగిన రౌడీలు. ప్రతి రాజకీయ పార్టీకి ఎన్నికల్లో బేలట్ బాక్స్ ఎత్తుకుపోవడానికి, రిగ్గింగ్ చేయడానికి, ప్రత్యర్థులను చంపడానికి కొందరు గూండాలుంటారు. వాళ్ళు ఆ పార్టీ సభ్యత్వము తీసుకుంటారు. వాళ్ళను పోలీసులు అరెస్టు చేసినా ఆ పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్‌కెళ్ళి విడిపిస్తారు."

"నాకిది చెప్పండి. ఎక్కడో రాజీవ్ గాంధీని చంపితే టోటల్ ఇండియా ఈ విధంగా క్లోజ్ చేస్తే కలిగే లాభం ఏమిటి?" అడిగాడు రవి అర్థంగాక.

"రాజీవ్‌గాంధీ హత్యకి నిరసనగా ఇండియా క్లోజ్ చేయాలన్నది కాంగ్రెస్ పార్టీ పాలసీ."

"రాజీవ్‌గాంధీ మీద ప్రేమ ఉన్నవాళ్ళు ఎలాగూ క్లోజ్ చేస్తారు. కానీ హూలిగన్స్ బెదిరించి బలవంతంగా మూయించడం నిరసన తెలపడం ఎలా అవుతుంది?" అడిగింది పావనితో లాజిక్ అర్థంగాక.

"ఏమోకానీ ఏ రాజకీయ నాయకుడ్ని అరెస్టు చేసినా, హత్య చేసినా ఇలాంటి బంద్‌లు తప్పవు."

"ప్రధానమంత్రి వస్తే ఇక్కడ రోడ్లకి అడ్డంగా స్తంభాలు కడతారు. సుస్వాగతం బోర్డులు కడతారు. లారీల్లో మనుషుల్ని పల్లెలనించి తరలించి తెస్తుంటారు. కానీ అమెరికన్ ప్రెసిడెంట్ మా ఊరు వస్తే ఆ సంగతి మాకు టీ.వీలో న్యూస్‌లో వింటే తప్ప తెలీదు." చెప్పింది లక్ష్మి.

"అక్కడ పొలిటిక్స్ కొందరు రాజకీయ నాయకుల సెనేటర్స్ బిజినెస్ మాత్రమే. ఇక్కడ పొలిటిక్స్ ప్రతివాడి బిజినెస్." చెప్పాడు వెంకటేశ్వరరావు.

బంద్ జరిపించేవారు రహదారికి అడ్డంగా రాళ్ళుపెట్టి బస్‌లని సిటీలోకి వెళ్ళనివ్వడంలేదు. పిల్లలతో వచ్చినవాళ్ళు, అర్జంట్ పనులున్న వాళ్ళు వెళ్ళి వాళ్ళను రిక్వెస్ట్ చేస్తున్నారు. తమ బస్‌ని వెళ్ళనివ్వమని వాళ్ళు ససేమిరా ఒప్పుకోలేదు.

చాలామంది తమ సూట్ కేసులతో బస్సులు దిగి సిటీవైపు నడకసాగించారు. వాళ్ళను అనుసరించి వెంకటేశ్వరరావు కుటుంబం రెండు కిలోమీటర్లు నడిచాక సైకిల్ రిక్షాలు కొన్ని దొరికాయి. వాటి మీద దిల్‌సుఖ్‌నగర్ దాకా వచ్చారు.

ఆటోలు లేవు షాపులు లేవు. సిటీ బస్సులు లేవు కర్ఫ్యూ పెట్టారు సిటీ అంతటా. ఫోన్ కోసం చూస్తే ఒక్క పబ్లిక్ ఫోన్ బూత్ కూడా తెరిచి లేదు.

చివరికి ఓ ఇంట్లో వాళ్ళను బ్రతిమలాడి వెంకటేశ్వరరావు తన తమ్ముడికి ఫోన్ చేసి జరిగింది చెప్పి తనెక్కడున్నాడో చెప్పాడు. అతను, అతని కొడుకు స్కూటర్‌ల మీద ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు.

ఫ్లయిట్ కేన్సిల్ అయింది. మూడురోజుల తర్వాత కానీ వాళ్ళు బాంబే చేరుకోలేకపోయారు. ఇంటర్నేషనల్ టికెట్ కాబట్టి మూడు రోజుల క్రితం విమానం ఎక్కకపోయినా టికెట్ కేన్సిల్ కాలేదు. నాలుగురోజులు ఆలస్యంగా అమెరికా చేరుకున్నారు వాళ్ళు.

విమానం ఎక్కాక చెప్పింది వాణి నవ్వుతూ. "డేడీ! బ్యూటిఫుల్ ఇండియా యువర్ గ్రేట్ ఇండియా!"

అమెరికాలో పుట్టి పెరిగిన, బంద్ అనేది ఉంటుందనే తెలియని వాణి ఫ్రస్టేషన్‌తో ఆ మాటలంది. ప్రగతికి వ్యతిరేకమైన, నిష్ప్రయోజనమైన ఆ బంద్ మీద, దాన్ని సృష్టించిన వారిమీద వాణికి ఛీత్కారభావం తప్ప ఇంకోటి లేదు. ఆ బంద్ వల్ల సాధించింది

ఏమిటో కూడా ఆమెకి అర్థం కాలేదు.

ఆ సంఘటనను గుర్తు చేశాడు వెంకటేశ్వరరావు. "నీవు చెప్పినది నిజమేననిపిస్తోంది. అది అక్కడ ఉంటే ఇండియాని ఇంకాస్త అసహ్యించుకోవచ్చు. కానీ పంపకుండా ఉండలేం. అది ఇక్కడుంటే ఇంకా సమస్య" చెప్పాడు.

ఆరోజు స్కూల్‌కి వెళ్ళలేదు వాణి. ముందు అనుకున్న అపాయింట్‌మెంట్ ప్రకారం ప్యారడైజ్ డిస్కోకి చేరుకుంది. స్టేన్లీ ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు. రాగానే దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు.

"తర్వాత ఎంట్రన్స్ ఫీజ్ చెల్లించాడు. ఇద్దరూ లోపలకి వెళ్ళారు. లోపల పాతిక జంటలదాకా చెవులు దద్దరిల్లేలా వినిపించే డిస్కో మ్యూజిక్‌కి డాన్స్ చేస్తున్నారు. వాళ్ళంతా టీనేజర్స్. రకరకాల లైట్లు ఆరి వెలుగుతున్నాయి. ఎంతో ఎగ్జయిటింగ్‌గా వుంది అక్కడి వాతావరణం. సగటు అమెరికన్ టీనేజర్స్‌ని ఎంతో ఆనందింపచేసే వినోదం అది.

పక్కనే నేలమీద విశాలమైన ఐస్ బ్లాక్ వుంది. దానిమీద స్కేటింగ్ చేస్తున్నారు కొందరు. కొద్దిసేపు ఇద్దరూ స్కేటింగ్ చేసారు. అలసిపోయేదాకా ఇద్దరూ డాన్స్ చేశాక దగ్గరే వున్న పిజ్జాహట్‌కి వెళ్ళారు.

వెయిట్రెస్ వచ్చి ఆర్డరు తీసుకున్నాక టేబుల్ మీద గడియారానికి కీ ఇచ్చి, మీటనొక్కి వెళ్ళింది.

"ఇప్పుడు చెప్పు - వాటీజ్ ది ప్రాబ్లం?" అడిగాడు స్టేన్లీ.

వాణి ఏదీ దాచకుండా ఇంట్లో జరిగినవన్నీ చెప్పింది. అయితే అది తన తల్లిదండ్రుల తప్పు అని ధ్వనించేలా చెప్పలేదు. తన తప్పు అని ధ్వనించేలా కూడా చెప్పలేదు. ఎవరివైపునుంచి వారు కరెక్టన్న పద్ధతిలో చెప్పింది.

"ఐ యామ్ రియల్లీ సారీ బేబీ! నావల్లే నీవు అమెరికా వదలాల్సి వస్తోందన్నమాట"

"ఇందులో ఎవరి తప్పూ లేదు. మా నాన్న అమ్మా భూమికి మరోవైపు. మరో రకం సంప్రదాయాలున్న దేశంలో పుట్టారు. వాళ్ళకి మాతృదేశ సంప్రదాయాలు ముఖ్యం. వాళ్ళ కూతురుగా నేను వాటికి విలువ ఇవ్వాలని వాళ్ళనుకోవడం వల్ల ఇలా జరిగిందంతే."

"మీ ఇండియాలో అన్నీ అరేంజ్డ్ మేరేజస్సే జరుగుతుంటాయా?"

"అవును."

"ఒకర్నొకరు పెళ్ళికి మునుపు అర్థం చేసుకునే అవకాశం లేకపోతే వాళ్ళ సంసారాలు సజావుగా సాగుతాయా? అక్కడ విడాకులు ఎక్కువా?" అడిగాడు.

"ఊహూ! బాగా తక్కువ. ఇప్పుడిప్పుడే విడాకుల రేటు పెరుగుతోంది. కాని డయివర్స్ యింకా సోషల్ టేబూగానే పరిగణిస్తారక్కడ.

చిన్నప్పటినుంచి ఆడపిల్లకి బోధిస్తారు. అత్తవారింటికి వెళ్ళాక భర్త అడుగుజాడల్లో, అత్తమామలకి సేవ చేసుకుంటూ బతకాలని, భర్త దైవం కింద లెక్క. అతని యిష్టప్రకారం నడుచుకోవాలన్న ఆచారం తరతరాలుగా వస్తోంది. భర్తమీద అలిగి పుట్టింటికి వచ్చేస్తే పిల్ల తల్లిదండ్రులు ఆమెకు నచ్చచెప్పి తిరిగి భర్త దగ్గరికి పంపుతారు, తప్పు ఆమె భర్తదయినాకూడా. పుట్టింట్లో పెళ్ళయిన ఆడపిల్ల ఉండటం గౌరవము కాదు. భర్త వదిలేసిన ఆడపిల్ల అంటే సమాజానికి చులకన ఇవన్నీ మా అమ్మ చెబుతూంటుంది."

"హౌ స్ట్రేంజ్"

"అందుకు ప్రధానకారణం ఆర్థికంగా ఆడపిల్లలకి స్వతంత్రం లేకపోవడం. ఇక్కడిలా ఉద్యోగావకాశాలు తక్కువ. అమెరికాలో ఏ భార్య ఉద్యోగం చేయాలనుకున్నా భర్త అభ్యంతరం పెట్టడు. ఉద్యోగంలో చేరి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండటంతో 'భార్య తనమీద ఆధారపడలేదు, విడిపోయి బతకగలదు. అలా విడిపోయినా సంఘం పట్టించుకోదు' అనే బెదురు ప్రతి భర్తకీ ఇక్కడ వుంటుంది.

ఇండియాలో అలాకాదు. 'తనని విడిచి భార్య పుట్టింట్లోకి వెళ్ళినా ఎక్కువకాలం ఉంచకుండా తిప్పి పంపుతారు. తను సంపాదించి ఒంటరిగా బతికే అవకాశంలేదు' అనే ధీమా అక్కడ భర్తలకి ఎక్కువ నిజమయిన మేల్ షోవినిస్ట్ పిగ్స్ ఉండేది యిక్కడకాదు, ఇండియాలో" అమెరికాకి, ఇండియాకి వివాహ సంబంధాల విషయంలోని తేడా వివరించింది వాణి.

"నేను ఇండియాలో పుట్టాల్సింది" నవ్వాడు స్టేన్లీ.

వాణికూడా నవ్వింది.

"మళ్ళీ ఎప్పుడు తిరిగివస్తావు?"

"ఓ ఏడాది రెండేళ్ళు. తెలీదు."

"ఐ విల్ మిస్ యూ వాణీ"

"ఐ విల్ మిస్ యూ టూ"

"ఉత్తరాలు రాస్తూంటావా?"

"నీనుంచి వచ్చే ప్రతి ఉత్తరానికి సమాధానం రాస్తూంటాను" జవాబు చెప్పింది వాణి.

పిజ్జా ప్లేట్స్‌తో వచ్చింది వెయిట్రెస్. వాటిని టేబుల్ మీద పెట్టి అలారం క్లాక్ మీటను నొక్కి ఆఫ్ చేసింది. పిజ్జా వున్న హట్ అమెరికా అంతటా కొన్ని వందల చెయిన్ ఆఫ్ రెస్టారెంట్స్. ఏ రెస్టారెంట్స్‌లో తిన్నా దొరికే పదార్థాలు, వాటి రుచి, ధర, లోపల డెకరేషన్, ఆఖరికి వెయిట్రెస్ యూనిఫారాలు కూడా ఒకేలా వుంటాయి.

పిజ్జా హట్ అమెరికన్ ఫాస్ట్ లైఫ్‌ని కేష్ చేసుకోడానికి సేల్స్ ప్రమోషన్‌గా ఓ నియమం పెట్టుకుంది. ఏ కష్టమర్ నుంచయినా ఆర్డర్ తీసుకున్న అయిదు నిముషాల్లోగా ఆ ఆర్డరు సర్వ్ చేయకపోతే ఆ పదార్థానికి బిల్ యివ్వరు. ఉచితం. అందుకే అలారం క్లాక్స్ ప్రతి టేబుల్ మీదా ఉంటాయి.

ఇద్దరూ పిజ్జాని తినసాగారు.

"ఐ విల్ మి స్‌దీస్ పిజ్జా అండ్ కోక్ టూ! మనుషులకన్నా ఇవి గొప్పా?" చెప్పింది వాణి.

తర్వాత తన మాటలకి తనకే, నవ్వొచ్చింది వాణికి.

"ఎప్పుడు నువ్వు వెళ్ళేది?"

చెప్పింది.

"ఐ విల్ కమ్ అండ్ సీ యు ఆఫ్?"

"ఎయిర్‌పోర్టుకా? రావద్దు. మా పేరెంట్స్‌కి నీవు రావడం నచ్చదు. వెళుతున్నప్పుడు కూడా ఎందుకు వాళ్ళని బాధపెట్టడం?"

"ఒకే! ఐ విల్ స్పేర్ దెమ్ ది బాదర్!"

ఇద్దరూ పిజ్జా తిన్నాక కోకోకోలా తాగారు.

"షల్ వి గో ఫరే డ్రయివ్?" అడిగాడు స్టేన్లీ - ఇద్దరూ బయటకు వచ్చాక.

"ఎక్కడికి?" అడిగింది.

"ఊరి బయటకి."

వాళ్ళు కారు ఊరి బయటకు వచ్చాక హైవేనుంచి పక్క రోడ్లోకి తీసుకెళ్ళి ఓ ఏపిల్ చెట్టుకింద ఆపాడు కారును.

నెకింగ్ నుంచి స్టేన్లీని ముందుకు వెళ్ళనివ్వలేదు వాణి.

"పార్టింగ్ గిఫ్ట్‌గా ఒప్పుకోరాదూ!" అడిగాడు వాణిని.

వాణి మనసులో ద్వంద్వభావాలున్నాయి. 'సరే'వేపు కొంత మనసు మొగ్గితే, 'వద్దు' వేపు మరికొంత మనసు మొగ్గింది. హిందూరక్తం అయివుండవచ్చు. తల్లితండ్రులు కన్యత్వం మీద చేసిన బోధన అయివుండవచ్చు. బ్లీడింగ్ అవుతుందన్న భయంకావచ్చు. స్టేన్లీని తను వివాహం చేసుకోలేనేమోనన్న శంక కావచ్చు. 'శీలం' ప్రాధాన్యం వహించిన వంశంలో పుట్టడం కావచ్చు. వాణి మనసు 'నో' వైపే ఎక్కువ మొగ్గింది.

"వద్దు, స్టేన్లీ! మన పెళ్ళయ్యేదాకా ఆగుదాం"

"నీవు నిజమైన ఇండియన్ అమ్మాయివి"

"అవును అలా ఉండటమే నాకిష్టం"

"కన్య అయిన భార్య దొరకడం అదృష్టం. ఐ లవ్ యూ స్టిల్ మోర్" చెప్పాడు స్టేన్లీ.

వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులంతా కారెక్కారు. ఎవరి మనసూ శాంతంగా లేదు. వాణి తన మధ్యనుంచి వెళ్ళిపోతున్నందుకు బాధగా వుంది.

అరగంట తర్వాత కారు ఎయిర్‌పోర్టులో ఆగింది. వెంకటేశ్వరరావు కొడుకు రవి వెళ్ళి ఓ ట్రాలీని తీసుకువచ్చాడు. కారు డిక్కీ తెరిచి రెండు పెద్ద సూట్‌కేసులు, ఓ ఎయిర్‌బేగ్, ఓ కేరీబేగ్‌లని అందులో వేశాడు.

అంతా దిగగానే వెంకటేశ్వరరావు కారు పార్క్ చేయడానికి తీసుకెళ్ళాడు.

"బెంగపెట్టుకోకు" చెప్పింది లక్ష్మి.

వాణి బదులు చెప్పలేదు.

"నీకుండదు కాని నాకు బెంగగా వుంది. నాన్నగారు మనసు మార్చుకుని వుండేవారు. కానీ, నీ సర్టిఫికెట్స్ కోసం స్కూల్‌కి వెళితే తెలిసింది నీవు స్కూల్‌కి రాలేదని ఆ స్టేన్లీగాడితో నిన్ను పేరడైజ్ డిస్కో దగ్గర చూసినవాళ్ళు చెప్పారు."

"సుహాసినీ చౌదరికి ఇంకేం పనిలేదా?"

"సుహాసిని కాదు. వాళ్ళమ్మాయి సుజా చూసిందట. సుహాసిని మీ నాన్నగారికి చెప్పిందా విషయం ఆయన సంగతి తెలుసుగా ఇంకాస్త మండిపడ్డారు. కొంపతీసి కాలుగాని జారావా?" అడిగింది లక్ష్మి.

"నువ్వేమనుకుంటున్నావు?" అడిగింది వాణి తన అహం దెబ్బ తినడంతో.

"నీవు అమెరికన్ వయితే ఎస్, ఇండియన్‌వయితే నో అనుకుంటున్నాను."

"నీ ఉద్దేశంలో నేను అమెరికెన్‌నా, లేక ఇండియన్‌నా?"

"నాకు తెలియదు" లక్ష్మి భుజాలెగరేసి చెప్పింది.

"నాన్నగారే ఈ ప్రశ్న నిన్నడగమన్నారు కదూ? ఆయనకి చెప్పు. నేను యింతదాకా ఇండియన్ అమ్మాయిలానే బిహేవ్ చేశాకాని, జూడీలానో, సుసాన్‌లానో బిహేవ్ చేయలేదని. మీరు అనవసరంగా తొందరపడ్డారు. స్టేన్లీని పెళ్ళిచేసుకునే ఉద్దేశం నాకు లేదు. నేను అతనితో ఎందుకు డేటింగ్‌కి వెళ్ళానో మీకు చెప్పి ప్రయోజనం లేదు. మీరెవరూ అర్థం చేసుకోలేరు" శాంతంగా చెప్పింది వాణి.

లగేజీ చెకిన్ చేసి బోర్డింగ్ పాస్ తెచ్చాడు రవి. తల్లిని, అక్కని కావలించుకుంది వాణి. విమానం ఎక్కబోయే ముందు రవికి గుడ్‌బై చెప్పింది.

"గుడ్‌బై డేడ్" చెప్పింది తండ్రితో ముభావంగా.

"గుడ్‌బై మై డార్లింగ్" చెప్పాడు వెంకటేశ్వరరావు.

ఇద్దరి కంఠాల్లో ఎంతో బాధ ఆ మాటలు మాట్లాడుతుంటే.

వాణి బోర్డింగ్ పాస్‌తో విమానం గేంగ్ వే వైపు నడుస్తూంటే వెంకటేశ్వరరావు వెనక నించి చెప్పాడు "న్యూయార్క్ నుంచి ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి ఫోన్ చెయ్యి తల్లీ"

"రైట్ డేడ్ హే వే గుడ్ డే" ఆగి వెనక్కి తిరిగి చూసి చెప్పింది.

విమానంలోకి ఎక్కకుండానే వాణి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తన సీట్లో కూర్చున్నాక టిష్యూ పేపర్‌తో కళ్ళు అద్దుకుంది.

న్యూయార్క్‌లో విమానం దిగాక బయటకు రాగానే డెల్టా ఎయిర్‌లైన్స్ రిప్రజెంటేటివ్ గేటు దగ్గర కనబడింది. వాణిని చూసి ఒంటరిగా ప్రయాణిస్తోందని గ్రహించగానే అడిగిందామె చిర్నవ్వుతో.

"మే ఐ హెల్ప్ యూ!"

వాణి తన టిక్కెట్‌ని చూపించి చెప్పింది.

"ఐ హేవ్ టు కేచ్ దిస్ ఇంటర్నేషనల్ ఫ్లయిట్"

న్యూయార్క్, ఫ్రాంక్‌ఫర్ట్ - బోంబే ఫ్లయిట్ వెళ్ళే గేట్ నంబరు చెప్పింది వాణికి.

"లగేజ్ ఆటోమేటిక్‌గా దాంట్లోకి మారుతుందా, లేక నేను క్లెయిమ్ చేసి మళ్ళీ బుక్ చేయాలా?" అడిగింది వాణి.

"డోంట్ బాదర్! డెల్టా నుంచి అందులోకి ఆటోమేటిక్‌గా మారుస్తారు. బోంబేలో దిగాక బేగేజ్ క్లెయిమ్ చేసుకోవచ్చు."

"థాంక్స్"

"హేవ్ ఏ నైస్ డే అండ్ హేపీ జర్నీ" చెప్పింది ఆమె చిరునవ్వుతో.

న్యూయార్క్‌లో ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్, సెక్యూరిటీ చెక్స్ అయ్యాక విమానం ఎక్కింది వాణి. ఆమె మనసు ఎంతో స్తబ్దంగా వుంది. విచారం లేని, ఆనందంలేని స్థితి అది.

న్యూయార్క్ నుంచి బోంబేకి ఇరవై మూడు గంటల ప్రయాణం. ఫ్రాంక్ ఫర్ట్‌లో విమానం దిగాక మెలుకువ వచ్చింది, పైలెట్ చెప్పిన ప్రకారం చేతి గడియారంలో టైము మార్చుకుంది.

విమానం దిగి ట్రాన్సిట్ పాస్ తీసుకుని ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్ పోర్ట్‌లోకి వెళ్ళింది.

లాంజ్‌లోకి వచ్చాక టెలిఫోన్ చూడగానే తండ్రి ఫోన్ చేయమనడం గుర్తుకొచ్చింది. కానీ వాణి ఫోన్ చేయలేదు ఇంటికి.

'నేషనల్ ఎన్‌క్వైయిరర్' వీక్లీ కొన్నది.

అమెరికాలో అత్యధికంగా అమ్ముడయ్యే ఆ వారపత్రిక అంటే అమెరికన్స్‌కి ప్రత్యేక ప్రేమ.

ఆ వారపత్రికను మైక్రో ఫిలిం తీసి భవిష్యత్తులో అమెరికాకు సంబంధించిన రిఫరెన్స్ కోసం వాషింగ్‌టన్‌లోని అమెరికన్ సెనేటర్స్ లైబ్రరీలో దాస్తున్నారు. అందులో అమెరికాకు చెందిన స్టాటిస్టిక్స్ అంటే వాణికి ఎంతో ఆసక్తి. ఆ సంచికలో ఇచ్చిన సమాచారం కొంత ఇది.

సగటున ప్రతి అమెరికన్ కుటుంబం ఏడాదికి ఇంటికోసం 47,724 డాలర్స్ ఖర్చు చేస్తుంది. (యు.ఎస్. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఫిగర్స్ ప్రకారం)

1994లో అమెరికన్ ప్రభుత్వం టాక్స్ రూపంలో వచ్చిన ప్రతి డాలర్‌లో 21 సెంట్లు సోషల్ సెక్యూరిటీ కోసం, 17 సెంట్లు ప్రజల ఆరోగ్య అవసరాల కోసం ఖర్చు చేసింది. మిగిలిన సెంట్లలో 19 దేశ యుద్ధంలో రిటైరైన వారికోసం, 2 సెంట్లు రవాణా కోసం ఖర్చు చేస్తోందని కన్స్యూమర్ రీసెర్చ్ కనుగొన్నది.

ఇంకో ఐటమ్ ఎంతో ఆసక్తికరంగా అనిపించింది వాణికి. అది పెళ్ళిళ్ళ గురించి.

ఏటా అమెరికన్స్ వివాహాల కోసం చేసే ఖర్చు 35 బిలియన్‌డాలర్లు. 35,000 కోట్ల డాలర్లు(లక్షా అయిదువేల కోట్ల రూపాయలు) సగటున ఓ పెళ్ళి కోసం అయ్యే ఖర్చు 17, 470 డాలర్లు.

అందులో పెళ్ళికూతురు గౌను కోసం 850 డాలర్లు.

హనీమూన్ కోసం 3,142 డాలర్లు.

ఎంగేజ్‌మెంట్ రింగ్ ఎన్నిక కోసం ఓ జంట వెదికే షాపులు (సగటున) 4.7

లాస్‌వెగాస్‌లో సగటున వారానికి జరిగే పెళ్ళిళ్ళు 1700.

వాణి ఆ ఐటమ్ కట్ చేసి ఓ ఇంటర్నేషనల్ కవర్ కొని స్టేన్లీ చిరునామా రాసి దాంట్లో ఆ క్లిప్పింగ్‌ని ఉంచి పోస్ట్ చేసింది. ఆ ఐటమ్ మీద 'థింకింగ్ ఆఫ్ యు' అని రాసి సంతకం చేసింది పోస్టు చేయబోయే ముందు.

విమానం బాంబేలో దిగేసరికి వాణి పూర్తిగా అలసిపోయింది.

రాజమండ్రి దాకా తనే ఒంటరిగా ప్రయాణం చేయడంతో ఇండియాకూ, అమెరికాకూ గల తేడాను స్పష్టంగా గుర్తించింది. అమెరికాలో కొంతకాలం వుండి ఇండియాకు వచ్చిన ప్రతీ ఇండియన్ ఫీలయ్యే విధంగానే ఫీలయింది వాణి తనకు ఎదురయిన అనుభవాలకి.

విమానం దిగాక ఇమ్మిగ్రేషన్ కౌంటర్‌లోని వ్యక్తి చిరాగ్గా ఉండటం, అదే సమయంలో సింగపూర్ నుంచి, హాంకాంగ్ నుంచి రెండు ఫ్లయిట్స్ రావడంతో ప్రయాణీకుల రద్దీ ఎక్కువై, సామాను తీసుకెళ్ళేందుకు ట్రాలీలు లేకపోవడం, వాణి సింగపూర్‌నుంచి వచ్చిందనుకుని కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ ఆమె సామాను తనిఖీ చేశాక తనకు కావాల్సిన విదేశీ వస్తువులు లంచంగా తీసుకోవడం, బయటకు రాగానే విదేశీ కరెన్సీ అమ్మమని టౌట్స్ వందరూపాయల కట్టలు ప్రదర్శించడంతో వాణి దిగ్భ్రాంతి చెందింది.

బాంబే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకి కృశ్చేవ్ బావమరిది నెహ్రూ వచ్చాడు ముందే సమాచారం అందడంతో, వాణిని హైదరాబాద్ ఫ్లయిట్ ఎక్కించడానికి.

అతన్ని అడిగింది టాక్సీలో "వీళ్ళిలా ఫారెన్ కరెన్సీ రోజూ కొంటూంటారా?"

"అవును"

"ఈ సంగతి తెలిసిన లా - ఎన్ ఫోర్స్ మెంట్ ఏజెన్సీలు పట్టించుకోవా?"

"ఉహూఁ. వాళ్ళకీ ఇందులో వచ్చే లాభంలో భాగం వుంటుంది."

"నిజంగానా?" అడిగింది వాణి ఆశ్చర్యంగా.

చిన్నగా నవ్వి అన్నాడు నెహ్రూ.

"ఇండియా జీవనంలో లంచం ఓ ప్రధాన భాగం. పై నుంచి కిందిదాకా"

"అన్ బిలీవబుల్" చెప్పింది.

బాంబేనుంచి హైదరాబాద్ వెళ్ళే విమానం గంటన్నర ఆలస్యం. నెహ్రూ బోర్డింగ్ పాస్ తీసుకువచ్చి ఇచ్చి జాగ్రత్తగా ఎక్కమని చెప్పి వెళ్ళిపోయాడు.

"ఎందువల్ల లేట్?" అడిగింది వాణి ఎంక్వయిరీ కౌంటర్ కెళ్ళి.

"ఏమో తెలియదు?"

"దయచేసి తెలుసుకుని చెప్పగలరా?"

విచిత్రంగా చూశాడతను ఆమెవైపు. బదులు చెప్పలేదు. గంట తర్వాత ఆలస్యం మరో గంటన్నరకు పెరిగింది. మళ్ళీ అడిగింది ఎంక్వయిరీలో లేట్‌కు కారణం ఏమిటని.

"తెలియదన్నాగా" విసుగ్గా చెప్పాడతను.

"కనుక్కుని చెప్పొచ్చుగా?"

"కుదరదు"

ఆ తర్వాత ఇండియా గురించి పూర్తిగా తెలిశాక అర్థమయింది వాణికి సమాచారం అనేది అమెరికాలోలా కాక, ఇండియాలో రహస్యంగా ఉంచుతారని. ప్రజలకు సంబంధించిన ఏ సమాచారమైనా అమెరికాలో అడగకుండానే తెలియచేసే ఆచారముంది.

ఇండియాలో ఆ పద్ధతికి భిన్నమైన పద్ధతి ఆచారంగా వస్తోందని గ్రహించింది.

హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వాణి బాబాయ్ వచ్చాడు ముందే వాణి తండ్రి తన తమ్ముడికి ఫోన్ చేసి చెప్పడంతో.

వాణి సామానుతో ఆటోలో ఎక్కితే, వెనకాల స్కూటర్ మీద వెంబడించాడు ఆయన ఆటోను.

"స్కాచ్ బాటిల్స్ తెచ్చావా అమ్మాయ్?" అడిగాడు ఆయన రాత్రి.

"విమానంలో కొన్నాను బాబాయ్. కానీ బాంబేలో కస్టమ్స్‌వాళ్ళు తీసేసుకున్నారు"

"అదేం? రెండు సీసాలు డ్యూటీ కట్టకుండా తెచ్చుకోవచ్చుకదా" అడిగాడాయన.

"అవివ్వకపోతే మిగిలిన వాటిమీద డ్యూటీ వేస్తామన్నారు" నిస్పృహగా చెప్పింది వాణి.

వాణి తనవెంట తెచ్చిన ప్రతివస్తువూ అమెరికాలో కొన్నవే కాబట్టి, దీన్ని కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ అడ్వంటేజ్‌గా తీసుకున్నాడు.

నిజానికి అమెరికన్ సిటిజన్ అయిన వాణి ఎలాంటి కస్టమ్స్ కట్టాల్సిన అవసరం లేకపోయినా, ఆ సంగతి పధ్నాలుగేళ్ళ వాణికి తెలియదు.

సెయింట్ లూయీ నుంచి ఫోన్ చేశాడు వెంకటేశ్వరరావు తన తమ్ముడింటికి వాణి హైదరాబాద్ క్షేమంగా చేరిందా, లేదా అని తెలుసుకోవడానికి.

ఆమె బాబాయి మాట్లాడాక చెప్పాడు.

"వాణీ! అమెరికానుంచి ఫోన్"

తన తండ్రితో మాట్లాడటానికి ఇష్టంలేక చెప్పింది వాణి "నేను మాట్లాడనన్నానని చెప్పు బాబాయ్"

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

Post your comments